సాక్షి
విశాఖపట్నం
గురువారం । 13 । మార్చి । 2025



వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో జరిగిన యువత పోరు కార్యక్రమానికి హాజరైన పార్టీ నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు



యువత పోరులో నినదిస్తూ..

వంచనపై ఆగ్రహం



వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో 'యువత పోరు' బాట విజయవంతం

అనుమతులున్నా ర్యాలీకి అడుగడుగునా ఆటంకం సృష్టించిన సర్కార్	బారికేడ్లు తోసుకొని ముందుకు కదిలిన వైఎస్సార్ సీపీ శ్రేణులు	ఫీజు రీయింబర్స్‌మెంట్, నిరుద్యోగ భృతి తక్షణమే చెల్లించాలని డిమాండ్	కలెక్టర్ హరేందిర ప్రసాద్‌కు వినతి పత్రం అందజేత



అడ్డుకుంటున్న పోలీసులు



కార్యక్రమంలో పాల్గొన్న పార్టీ నేతలు, కార్యకర్తలు, విద్యార్థులు



కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న పార్టీ రీజనల్ కోఆర్డినేటర్ కన్నబాబు, పార్టీ జిల్లా అధ్యక్షుడు అమర్‌నాథ్, మేయర్ హరి వెంకట కుమారి, పార్టీ నేతలు

సాక్షి, విశాఖపట్నం : యువత కదం తొక్కింది. సమస్యలపై రణభేరి మోగించింది. వైఎస్సార్ సీపీ జిల్లా యువజన విభాగం, విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన 'యువత పోరు' విజయవంతమైంది. బుధవారం ఉదయం జిల్లా పరిషత్ జంక్షన్ వద్ద గల కృష్ణ మందిరం నుంచి పాదయాత్రగా కలెక్టరేట్‌కు వెళ్లేందుకు నిరుద్యోగ యువత, వైఎస్సార్ సీపీ శ్రేణులు సిద్ధమయ్యాయి. ర్యాలీకి ముందుగానే పార్టీ తరఫున అనుమతులు తీసుకున్నా.. పాదయాత్రగా కలెక్టరేట్‌కు వెళ్లేందుకు నిరాకరిస్తూ పోలీసులు బారికేడ్లతో కట్టడి చేయాలని ప్రయత్నించారు. పార్టీ రీజనల్ కోర్డినేటర్ కన్నబాబు, మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, మేయర్ గొలగాని హరివెంకటకుమారి, మాజీ ఎమ్మెల్యేలు వాసుపల్లి గణేష్ కుమార్, చింతలపూడి వెంకట్రామయ్య, మళ్ల విజయ్‌ప్రసాద్, తైనాల విజయ్‌కుమార్‌తో పాటు పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ బారికేడ్లను తోసుకుంటూ అడుగులు వేశారు. డౌన్ డౌన్ కూటమి ప్రభుత్వం అంటూ నిరుద్యోగులు, యువత, విద్యార్థులు నినాదాలు చేస్తూ ముందుకు కదలడంతో పోలీసులు విడిచిపెట్టేశారు.

గేటు దగ్గర కూడా గలాటా..

జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు దొడ్డి కిరణ్, విద్యార్థి విభాగం అధ్యక్షుడు పులగం కొండా రెడ్డి ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్దకు భారీ ర్యాలీగా వచ్చారు. అనంతరం విద్యార్థులు, నిరుద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కలెక్టర్ హరేందిరప్రసాద్‌కు వినతి పత్రం అందించేందుకు వెళ్తుండగా పోలీసులు అడ్డుకునేందుకు యత్నించారు. శాంతియుతంగా ర్యాలీ చేస్తున్న సమయంలో రెచ్చగొట్టే ధోరణి సరికాదని పార్టీ నేతలు హెచ్చరించడంతో పోలీసులు లోపలికి కొందర్ని మాత్రమే అనుమతించారు.

అరగంట వెయిటింగ్

వినతి పత్రం ఇచ్చేందుకు మాజీ మంత్రులు కన్నబాబు, అమర్‌నాథ్, మేయర్ హరివెంకట కుమారి, డిప్యూటీ మేయర్లు, మాజీ ఎమ్మెల్యేలు కలెక్టర్ చాంబర్‌కు వెళ్లారు. ఆ సమయంలో కలెక్టర్ స్థానిక అధికారులతో స్వచ్ఛ సర్వేక్షణ్‌పై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్నారు. వీరంతా వచ్చారని కలెక్టర్‌కు పేషీ సిబ్బంది సమాచారం ఇచ్చినా దాదాపు అరగంట వరకు లాబీలో వెయిట్ చేయించారు. అయినా మాజీ మంత్రులు ఏమాత్రం అసహనానికి గురికాకుండా విద్యార్థులు, నిరుద్యోగుల భవిష్యత్తు కోసం ఓపిగ్గా ఉన్నారు. విద్యార్థులు, నిరుద్యోగుల సమస్యలపై కలెక్టర్‌కు వినతి పత్రం అందించారు.

యువత పోరుకు మద్దతు తెలిపిన వారిలో పార్టీ సమన్వయకర్తలు కేకే రాజు, తిప్పల దేవన్‌రెడ్డి, పార్టీ కార్యాలయ పర్యవేక్షకులు రవిరెడ్డి, రాష్ట్ర అనుబంధ విభాగం అధ్యక్షులు జాన్ వెస్లీ, పేర్ల విజయ్ చంద్ర, కాంతి మహంతి సత్యనారాయణ, కొండా రాజీవ్ గాంధీ, జిల్లా పార్టీ ఉపాధ్యక్షులు నడింపల్లి కృష్ణంరాజు, చెన్నా జానకిరామ్, బాణాల శ్రీనివాస రావు, జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి ముమ్వల సురేష్, ద్రోణంరాజు శ్రీ వాస్తవ, అల్లు శంకర్ రావు, జిల్లా పార్టీ అధికార ప్రతినిధి బింగి హరి కిరణ్ రెడ్డి, పల్లా దుర్గారావు, దొడ్డి రామనాథ్, డా.మంచా నాగ మల్లీశ్వరి, షేక్ మహ్మద్ గౌస్, పార్టీ ముఖ్య నాయకులు మొల్లి అప్పారావు, అనుబంధ విభాగ అధ్యక్షులు పేడాడ రమణికుమారి, బోని శివరామ కృష్ణ, సేనాపతి అప్పారావు, పీలా ప్రేమ కిరణ్, కర్రి రామారెడ్డి, సకలాభక్తుల ప్రసాద్‌రావు, రాయపు అనిల్ కుమార్, బోండా ఉమామహేశ్వరరావు, లావణ్య చిమట, వాసుపల్లి యల్లాజీ, గున్నంటి పూర్ణానంద శర్మ, కార్పొరేటర్లు దౌలపల్లి ఏడుకొండల రావు, కోరుకొండ వెంకటరత్న స్వాతి దాస్, కెల్లా సునీత సత్యనారాయణ, కటారి అనిల్ కుమార్, మొల్లి లక్ష్మిఅప్పారావు, గేదెల లావణ్య నాగరాజు, నక్కిల్ల లక్ష్మి, సాడి పద్మారెడ్డి, బిపిన్ కుమార్ జైన్, ఎం.మెర్సిరాజు, గుండపు నాగేశ్వర రావు, కోడిగుడ్ల పూర్ణిమ, అల్లు శంకరరావు, రెయ్యి వెంకటరమణ, ముర్రు వాణి, జి.లావణ్య, పీవీ సురేష్, కొణతాల సుధ, బల్లా లక్ష్మణ్, మహ్మద్ ఇమ్రాన్, గుడివాడ సాయి అనుష లతీష్, ఉరుకూటి రామచంద్రరావు, తిప్పల వంశీరెడ్డి, వార్డు అధ్యక్షులు, విద్యార్థులు, అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంలో భయం మొదలైంది..

'యువత పోరు'ను పోలీసుల ద్వారా అడ్డుకునే ప్రయత్నం చేయడం చూస్తుంటే.. ప్రజాపోరాటాలు చూసి చంద్రబాబు వణికిపోతున్నారని అర్థమవుతుంది. కూటమి అధికారంలోకి వచ్చి 10 నెలలు గడవక ముందే వైఎస్సార్ సీపీ పిలుపు ఇస్తే ఇంత మంది ఎందుకు రోడ్ల మీదకు వస్తున్నారో ఆలోచించాలి. వైఎస్ జగన్ ప్రభుత్వంలో విద్యార్థులకు అనేక సంక్షేమ పథకాలు అందితే.. ఇప్పుడు విద్యార్థులకు హాల్ టికెట్లు వస్తాయో రావో తెలియని దుస్థితి నెలకొంది. దేశ చరిత్రలో ఎక్కడా లేని విధంగా 17 ప్రభుత్వ మెడికల్ కాలేజీల్ని వైఎస్ జగన్ తీసుకొస్తే సిగ్గు లేకుండా బాబు వాటిని ప్రైవేట్‌కు విక్రయించాలని చూస్తున్నారు. ఇప్పటికే వేల కోట్ల అప్పులు తీసుకొచ్చిన కూటమి ప్రభుత్వం.. ప్రాధాన్యత రంగాలైన విద్య, వైద్యానికి కేటాయించడం తెలియదా? అసలు తెచ్చిన అప్పులు ఏం చేశారో జవాబు చెప్పాలి. రాష్ట్రంలో అంబేడ్కర్ రాజ్యాంగం కాకుండా లోకేష్ రాసిన రాజ్యాంగం అమలు చేస్తున్నారు.

– కురసాల కన్నబాబు, వైఎస్సార్ సీపీ ఉత్తరాంధ్ర రీజనల్ కో–ఆర్డినేటర్

బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ

పేద విద్యార్థుల చదువులంటే కూటమి ప్రభుత్వానికి చులకన. అధికారంలో వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకు ఫీజుల కోసం ఒక్క పైసా విదల్చలేదు. జాబ్ క్యాలెండర్ జాడలేదు.. నిరుద్యోగ భృతి ఊసే లేదు.. ప్రభుత్వ మెడికల్ కాలేజీల సహా ప్రభుత్వ సంస్థలను ప్రైవేటుబాట పట్టిస్తోంది. ఎన్నికల ముందు బాబు ష్యూరిటీ భవిష్యత్ గ్యారెంటీ అన్నారు.. ఇప్పుడు మోసం గ్యారెంటీ అన్నట్లుగా పాలన ఉంది. రానున్న రోజుల్లో అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు ప్రజల పక్షాన నిలబడి.. ప్రభుత్వం మెడలు వంచి ఇచ్చిన హామీలు నెరవేర్చే వరకూ పోరాటాలు సాగిస్తాం.

– గుడివాడ అమర్‌నాథ్, మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు

డబ్బులు లేవని తెలిసి ఎందుకు హామీ ఇచ్చారు?



చెప్పిన టైమ్‌కి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇచ్చింది. మా చదువులు సాఫీగా సాగిపోయాయి. ఇప్పుడు నాకు తెలిసిన సర్కిల్‌లో 300 మంది వరకూ ఫీజు రీయింబర్స్‌మెంట్ రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. చదువు మీద దృష్టి సారించలేకపోతున్నాం. డబ్బులు లేవని ఈ ప్రభుత్వం చెబుతోంది. డబ్బులు లేనప్పుడు ఎందుకు హామీ ఇచ్చారు.?

– శివయాదవ్, డిగ్రీ ఫైనల్ ఇయర్ విద్యార్థి

ప్రజాహితమే లక్ష్యం



పార్టీ జెండా ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర రీజనల్ కోఆర్డినేటర్ కురసాల కన్నబాబు, పార్టీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్. చిత్రంలో ఇతర నాయకులు

మహారాణిపేట: వైఎస్సార్ సీపీ 15వ ఆవిర్భావ దినోత్సవాన్ని మద్దిలపాలెంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. పార్టీ ఉత్తరాంధ్ర రీజినల్ కోఆర్డినేటర్ కురసాల కన్నబాబు, పార్టీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్ పాల్గొని పార్టీ జెండాను ఆవిష్కరించారు. డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్, వైఎస్సార్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేశారు. ప్రజాహితమే లక్ష్యంగా 15 ఏళ్లుగా పార్టీ పనిచేస్తుందని నేతలు తెలిపారు.

విశాఖ జిల్లా వలంటీర విభాగం అధ్యక్షురాలు పీలా ప్రేమ్ కిరణ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, మాజీ ఎమ్మెల్యేలు తిప్పల నాగిరెడ్డి, మళ్ల విజయ ప్రసాద్, తైనాల విజయకుమార్, చింతలపూడి వెంకటరామయ్య, సమన్వయకర్తలు తిప్పల దేవన్ రెడ్డి, పార్టీ కార్యాలయ పర్యవేక్షకుడు రవిరెడ్డి, రాష్ట్ర అనుబంధ విభాగం అధ్యక్షులు పేర్ల విజయ్ చందర్, జాన్ వెస్లీ, పార్టీ ముఖ్య నాయకులు డాక్టర్ జహీరాబాద్, ఉడా రవి, పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు నడింపల్లి కృష్ణంరాజు, జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి ద్రోణంరాజు శ్రీ వాస్తవ, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి హరికిరణ్ రెడ్డి, డాక్టర్ మంచా నాగ మల్లీశ్వరి, అనుబంధ విభాగ అధ్యక్షులు పేడాడ రమణి కుమారి, బోని శివ రామకృష్ణ, బొండా మహేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

ఏయూలో ఆకలి కేకలు..!

- భోజనం కోసం రోడ్డెక్కిన విద్యార్థులు
- మెయిన్ గేట్ వద్ద ఖాళీ కంచాలతో నిరసన



ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న విద్యార్థులు



ఏయూ మెయిన్‌గేట్ వద్ద ఆందోళన చేస్తున్న విద్యార్థులు



ఖాళీ కంచంతో నిరసన

విశాఖ విద్య: ఆంధ్ర యూనివర్సిటీ విద్యార్థులు బుధవారం రాత్రి రోడ్డెక్కారు. హాస్టళ్లలో సరిగా భోజనం పెట్టడటం లేదంటూ వర్సిటీ ప్రధాన గేటు ముందు బైఠాయించి ఖాళీ కంచాలతో నిరసన తెలిపారు. తమ గోడు పట్టించుకోని వర్సిటీ అధికారులు, ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. 'ఇదేమి రాజ్యం.. దోపిడీ రాజ్యం .. దొంగల రాజ్యం' అంటూ నినదిస్తూ ఖాళీ కంచాలను నేలపై కొడుతూ తమ ఆకలి బాధను తీర్చాలంటూ ఆందోళన వ్యక్తం చేశారు. యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ హాస్టళ్లలో భోజనం సరిగా పెట్టడం లేదని కొన్ని రోజుల క్రితం విద్యార్థులు వీసీ భవనం ముందు నిరసన చేపట్టారు. విద్యార్థులు, వర్సిటీ ఆచార్యులతో కమిటీ ఏర్పాటు చేసి, వారి ఆధ్వర్యంలోనే హాస్టళ్ల నిర్వహణ సాగేలా చూస్తామని వీసీ, రిజిస్ట్రార్ చెప్పడంతో అప్పట్లో విద్యార్థులు తమ ఆందోళన విరమించారు. మళ్లీ వారం రోజులు తిరిగేసరికి వర్సిటీ అధికారుల మాటల బుట్టదాఖలు చేస్తూ, హాస్టళ్ల అధికారులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ.. తమను ఖాళీ కడుపుతో ఉండేలా చేస్తున్నారని విద్యార్థులు వర్సిటీ పెద్దల దృష్టికి తీసుకొచ్చారు.

పురుగులు ఉన్నాయన్నా పట్టించుకోలేదు

బుధవారం మధ్యాహ్న భోజనంలో పురుగులు ఉన్నాయని విద్యార్థులు హాస్టళ్ల నిర్వాహకులకు తెలిపారు. దీనిపై ఎవరూ పట్టించుకోకపోగా రాత్రి భోజనం కూడా పరిశుభ్రత లేకుండా వండిపెట్టారు. దీంతో విద్యార్థులు రాత్రి భోజనాలు తినడటం మానేసి.. ఖాళీ కంచాలతో హాస్టళ్ల నుంచి నినాదాలు చేసుకుంటూ వర్సిటీ ప్రధాన గేటు వద్దకు వచ్చారు. వర్సిటీ సెక్యూరిటీ సిబ్బంది అడ్డుకునే ప్రయత్నం చేసినప్పటికీ తమ బాధను అర్థం చేసుకోవాలని కోరుతూ విద్యార్థులంతా ప్రధాన గేట్లు మూసేసి రోడ్డుపై బైఠాయించారు. వర్సిటీ అధికారులకు, ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. విషయం తెలుసుకున్న ఈస్ట్ డివిజన్ ఏసీపీ లక్ష్మణ మూర్తి, ఇతర పోలీసు అధికారులు, సిబ్బందితో కలిసి ఏయూకు చేరుకున్నారు. విద్యార్థులతో వారు మాట్లాడే ప్రయత్నం చేయగా మధ్యాహ్నం పురుగులతో కూడిన అన్నం పెట్టినట్లుగా తమ సెల్‌ఫోన్లలో తీసిన ఫొటోలు, వీడియోలను పోలీసు అధికారులకు చూపించడంతో వారు మిన్నుకుండిపోవాల్సి వచ్చింది.

ప్రభుత్వానికి విద్యార్థుల బాధలు పట్టవా..?:

వర్సిటీ క్యాంపస్ హాస్టళ్ల విద్యార్థులు అర్ధాకలితో అలమటించే పరిస్థితులు దాపురించాయని, ఇలాంటి దారుణమైన పరిస్థితులు ఎన్నడూ లేవని ఎస్ఎఫ్ఐ యూనివర్సిటీ కమిటీ కార్యదర్శి వెంకటరమణ అన్నారు. ప్రభుత్వం తమ బాధలను ఏమాత్రం పట్టించుకోవడం లేదన్నారు. స్కాలర్‌షిప్పులు మంజూరు కాకపోవటంతో తమపైనే హాస్టళ్ల నిర్వహణ భారం వేస్తున్నారని, చివరకు సిబ్బంది జీతాలకు చెల్లించాల్సిన డబ్బులను కూడా విద్యార్థుల నుంచే వసూలు చేస్తున్నారన్నారు. తమ బాధలను ప్రభుత్వానికి తెలియజేయాలనే నిరసన చేపట్టామన్నారు. విద్యార్థుల ఆందోళన రాత్రి 8 గంటల నుంచి 11 గంటల వరకు కొనసాగింది.

క్రికెట్ బుకీ అరెస్ట్

విశాఖ సిటీ: క్రికెట్ బెట్టింగ్ కేసులో ప్రధాన ముద్దాయిని సిటీ టాస్క్ ఫోర్స్ పోలీసులు అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళితే.. నగర పోలీస్ కమిషనర్ ఆధ్వర్యంలో సిటీ టాస్క్‌ఫోర్స్, సైబర్ క్రైం పోలీసులు సంయుక్తంగా పెదవాల్తేర్ డాక్టర్స్ కాలనీలో గాయత్రి టవర్స్ వద్ద గల ఒక ఇంటిపై బుధవారం రైడ్ నిర్వహించారు. ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్న కోపనాతి సాయితేజ అలియాస్ తేజ (27) అనే బుకీని పట్టుకున్నారు. అతని వద్ద నుంచి ఒక ల్యాప్ టాప్, రెండు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. వాటిని పరిశీలించి బెట్టింగ్ కోసం ఉపయోగిస్తున్న 80 బ్యాంకు అకౌంట్లు గుర్తించారు. వాటిలో ఉన్న సుమారు రూ.45 లక్షల నగదును ఫ్రీజ్ చేశారు. బ్యాంకు నుంచి అందుకున్న సమాచారం ప్రకారం ఆయా అకౌంట్లలో రూ.178 కోట్లు లావాదేవీలు జరిగినట్టు పోలీసులు తెలిపారు. తేజను రిమాండ్‌కు తరలించారు.

'ఎన్నికల'పై ఈసీకి సూచనలివ్వండి

కలెక్టర్ హరేంధిర ప్రసాద్

మహారాణిపేట: ఈఆర్వో, డీఈవో, సీఈవో స్థాయిల్లో పరిష్కారం కాని ఎన్నికల సమస్యలపై జాతీయ, ప్రాంతీయ రాజకీయ పార్టీలు నేరుగా భారత ఎన్నికల సంఘానికి (ఈసీఐ) సూచనలు ఇవ్వవచ్చని కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ తెలిపారు. ఈ మేరకు ఈసీఐ వెసులుబాటు కల్పించిందని, ఏప్రిల్ 30లోగా పార్టీలు తమ సూచనలు అందజేయాలని కోరారు. ఎన్నికల ప్రక్రియను బలోపేతం చేసేందుకు పార్టీలతో చర్చలకు కూడా ఈసీఐ యోచిస్తోందన్నారు. రాజకీయ పార్టీలతో క్రమం తప్పకుండా సమావేశాలు నిర్వహించి, వచ్చిన సూచనలను చట్ట పరిధిలో పరిష్కరించాలని, ఈ నెలాఖరులోగా నివేదిక సమర్పించాలని ఈసీఐ ఆదేశించిందని ఆయన పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని రాజకీయ పార్టీలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు. ఈ మేరకు రాజకీయ పార్టీలకు ఎన్నికల సంఘం లేఖలు పంపిందని వెల్లడించారు.

జూలో పెరుగుతున్న రేచు కుక్కల సంతతి



ఆరిలోవ: జూలో రేచు కుక్కల సంతతి పెరుగుతోంది. ప్రస్తుతం వీటి సంఖ్య 56కు చేరింది. ఏటా జనవరి నుంచి మార్చి వరకు రేచు కుక్కల పునరుత్పత్తికి అనుకూలమైన సమయం. ఈ క్రమంలో ఈ ఏడాది జనవరి నుంచి ఇంత వరకు జూలో మూడు ఆడ అడవి కుక్కలకు 16 పిల్లలు పుట్టినట్లు క్యూరేటర్ జి.మంగమ్మ తెలిపారు. ఇవి ఆరోగ్యంగా ఉన్నట్లు చెప్పారు. పునరుత్పత్తి కేంద్రంలో పిల్లలు తల్లి కుక్కలతో కలిసి హుషారుగా తిరుగుతున్నాయన్నారు. జంతు మార్పిడి విధానంలో ఇవి ప్రధాన పాత్ర పోషిస్తున్న విషయం తెలిసిందే. ఇతర జూ పార్కుల నుంచి వన్యప్రాణులను విశాఖ జూకి తీసుకువచ్చినప్పుడు వీటిలో కొన్నింటిని ఆయా జూ పార్కులకు తరలిస్తున్నారు.

పది పరీక్షలకు పక్కా ఏర్పాట్లు

- జిల్లాలో 134 పరీక్ష కేంద్రాలు
- హాజరుకానున్న 29,927 మంది విద్యార్థులు
- సమస్యాత్మక కేంద్రాలపై ప్రత్యేక నిఘా
- డీఈవో ప్రేమ్ కుమార్ వెల్లడి



విశాఖ విద్య: పదో తరగతి పరీక్షలకు జిల్లాలో పకడ్బందీగా ఏర్పాట్లు చేశామని జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.ప్రేమ్‌కుమార్ అన్నారు. బుధవారం ఆయన 'సాక్షి'తో మాట్లాడుతూ పరీక్షలకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. ఈ నెల 17 నుంచి 31 వరకు పదో తరగతి పరీక్షలు జరుగుతాయన్నారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్యాల పరిధిలోని 448 మంది పాఠశాలల నుంచి 28,528 మంది విద్యార్థులు రెగ్యులర్‌గా, మరో 1,404 మంది ప్రైవేటుగా పరీక్షలకు హాజరవుతున్నారన్నారు. ఇందుకోసం జిల్లాలో 134 కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. పరీక్షల సమయంలో ఎటువంటి అవాంతరాలు లేకుండా, ఎంపిక చేసిన కేంద్రాల్లో అన్ని రకాల సౌకర్యాలు కల్పించామన్నారు. ఎండల తీవ్రత దృష్ట్యా విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా కేంద్రాల్లో వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య శిబిరాలను నిర్వహిస్తామన్నారు.

విధులకు అంతా సిద్ధం కావాలి

పరీక్షల నిర్వహణకు 134 మంది సీఎస్‌లు, 134 మంది డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లు, 14 మంది రూట్ ఆఫీసర్లు, మరో 14 మంది అసిస్టెంట్ రూట్ ఆఫీసర్లను పరీక్షల పర్యవేక్షణకు వినియోగిస్తున్నామన్నారు. ఎగ్జామినేషన్ విధులు కేటాయించిన వారికి గురువారం శిక్షణ ఇచ్చేలా కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్‌లకు ఆదేశాలు ఇచ్చామన్నారు. అనకాపల్లి జిల్లా నుంచి 240 మంది ఉపాధ్యాయులను రిజర్వ్‌లో ఉంచామన్నారు.

సమస్యాత్మక కేంద్రాలపై ప్రత్యేక నిఘా

జిల్లాలో గుర్తించిన ఐదు సమస్యాత్మక కేంద్రాలపై ప్రత్యేక నిఘా పెడుతున్నామన్నారు. పరీక్షల్లో ఎటువంటి మాస్ కాపీయింగ్‌కు తావులేకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశామన్నారు. ప్రశ్నాపత్రాలు కేంద్రాలకు సమీపంలోని పోలీసు స్టేషన్లలో భద్రపరచటం జరిగిందన్నారు. జిల్లాలో రవాణా సౌకర్యం, మార్కెట్ సముదాయాలకు దగ్గరగా, పోలీసు స్టేషన్లకు దూరంగా ఉన్న 9 పరీక్ష కేంద్రాలను సీ– కేటగిరీలో ఉన్నాయన్నారు. వీటిపై పర్యవేక్షణకు ప్రతీ కేంద్రంకు ఒక కస్టోడియన్‌ను అదనంగా నియమించామన్నారు. ఐదు ఫ్లెయింగ్ స్క్వాడ్ టీమ్‌లను ఏర్పాటు చేశామని, వీరు ప్రతీ రోజూ జిల్లా అంతటా పర్యటించి, కేంద్రాలను తనిఖీ చేస్తారన్నారు.

14 కేంద్రాల్లో ఓపెన్ టెన్త్ పరీక్షలు

ఈ సారి రెగ్యులర్ వారితో పాటు సార్వత్రిక విద్యా పీఠం(ఓపెన్) ఆధ్వర్యంలో పదో తరగతి పరీక్షలు కూడా నిర్వహిస్తున్నామన్నారు. జిల్లాలో 938 మంది పరీక్షలకు హాజరుకానున్నారని, వీరి కోసం 14 కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. రెగ్యులర్ కేంద్రాల్లోనే వీరికి కూడా గదులు కేటాయించటం జరిగిందన్నారు.

నో మొబైల్ జోన్‌గా పరీక్ష కేంద్రాలు

పరీక్ష కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను తీసుకెళ్లకూడదన్నారు. ఇన్విజిలేషన్ సిబ్బంది, చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లు కూడా కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లు తీసుకురావద్దన్నారు. కలెక్టర్ హరేంధిర ప్రసాద్ సూచనలకు అనుగుణంగా జిల్లాలోని మిగతా శాఖల సమన్వయంతో పరీక్షల విజయవంతానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామన్నారు.

పది పరీక్షలపై సీఎస్ కాన్ఫరెన్స్

మహారాణిపేట: పదో తరగతి పరీక్షల నిర్వహణకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ సచివాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించగా కలెక్టరేట్ నుంచి కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్, జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, జిల్లా అధికారులు పాల్గొన్నారు. పరీక్షల నిర్వహణ కోసం చేపడుతున్న ఏర్పాట్లను, అదేవిధంగా స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమం అమలు తీరు, పి4 మోడల్ సర్వే, ప్రజలకు అవగాహన కార్యక్రమాల గురించి వివరించారు.

ఆర్థిక సహాయం అందరికీ కాదు..

- 24,696 మందిలో 8,619 మంది ఇళ్ల లబ్ధిదారులే అర్హులు
- ఎస్సీ, బీసీలకు రూ.50 వేలు, ఎస్టీలకు రూ.75 వేలు అదనపు సాయం
- కలెక్టర్ హరేంధిర ప్రసాద్ వెల్లడి



మాట్లాడుతున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్, చిత్రంలో హౌసింగ్ పీడీ సత్తిబాబు

సాక్షి, విశాఖపట్నం: గత ప్రభుత్వ హయాంలో ప్రారంభమై అసంపూర్తిగా ఉన్న ఇళ్ల నిర్మాణానికి ప్రస్తుత ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సాయం అందరికీ ఇవ్వడం లేదని కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ స్పష్టం చేశారు. జిల్లాలో పీఎంఏవై అర్బన్, గ్రామీణం కింద ఒకటి రెండు ఆప్షన్‌లో 24,696 గృహాలు నిర్మాణ దశలో ఉండగా.. ఇందులో 8,619 మందికి మాత్రమే ఆర్థిక సాయం అందించనున్నట్లు వెల్లడించారు. కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో బుధవారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పీఎంఏవైలో ఇల్లు మంజూరై వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్న గృహాలకు సంబంధించి ఎస్సీ, ఎస్టీ, బీసీలకు అదనంగా ఆర్థిక సాయం అందించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. వివిధ దశల్లో నిర్మాణాల్లో ఇళ్లకు ఉన్న ప్రస్తుత యూనిట్ విలువ రూ.1.80 లక్షలు కాగా.. అదనంగా ఎస్సీలు, బీసీలకు రూ. 50 వేలు, ఎస్టీలకు రూ.75 వేలు, పీవీజీటీలకు రూ.లక్ష చొప్పున సాయం అందిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. జిల్లాలో పీఎంఏవై కింద 8,619 మంది లబ్ధిదారులకు రూ.43.40 కోట్ల అదనపు సాయం అందుతుందని వెల్లడించారు. నిర్మాణం పూర్తి చేసుకునే దశల వారీగా అదనపు మొత్తాన్ని లబ్ధిదారుల ఖాతాకు నేరుగా జమ చేస్తారని చెప్పారు. జిల్లాలో మే నెలాఖరు నాటికి 7,750 గృహాలు పూర్తి చేసేందుకు లక్ష్యాన్ని నిర్దేశించుకున్నట్లు తెలిపారు. గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా బీసీ, ఎస్సీ, ఎస్టీ ఇళ్ల నిర్మాణ లబ్ధిదారుల నిర్మాణ దశలను గుర్తించి అదనపు సాయం మంజూరు జరుగుతుందన్నారు. ఇళ్ల నిర్మాణానికి అవసరమైన ఇసుకను సరఫరా చేసేందుకు ప్రత్యేక ర్యాంపులను కేటాయించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు కలెక్టర్ వెల్లడించారు.

త్వరలో బ్లూఫ్లాగ్ జ్యూరీ బృందం రాక

రుషికొండ బీచ్‌కు బ్లూఫ్లాగ్‌ను ఇటీవల తాత్కాలికంగా గుర్తింపు రద్దు చేసిన నేపథ్యంలో దిద్దుబాటు చర్యలు చేపడుతున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. తాత్కాలికంగా జీవీఎంసీ సహకారంతో మొబైల్ టాయిలెట్స్ ఏర్పాటు చేశామని, బ్లూఫ్లాగ్‌కు అవసరమైన మౌలిక వసతులు కల్పిస్తున్నట్లు వివరించారు. త్వరలోనే సర్టిఫికెట్ జారీ చేసే జ్యూరీ బృందం రుషికొండ వస్తుందన్నారు. ఈలోగా సమగ్ర ఏర్పాట్లు చేసి పర్యాటకులకు అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. జ్యూరీ బృందం సంతృప్తి పడే విధంగా బీచ్‌ను సుందరీకరించి.. సర్టిఫికెట్ రెన్యువల్ చేసేందుకు వంద శాతం కృషి చేస్తామని కలెక్టర్ వెల్లడించారు.

సృజనతో మెరిసి.. విజేతగా నిలిచి..

- ఉత్సాహంగా చిత్రలేఖనం పోటీలు



9వ తరగతి విద్యార్థి బాలచందర్ గీసిన చిత్రం



విజేత గీసిన చిత్రం చూపిస్తున్న ఈడీ రాణిమందా

కొమ్మాది: గిరిజన స్వాభిమాన ఉత్సవాలు–2025లో భాగంగా రుషికొండలోని గిరిజన సాంస్కృతిక పరిశోధన శిక్షణ మిషన్(టీసీఆర్‌టీఎం) ఆధ్వర్యంలో గాయత్రి కళాశాల ప్రాంగణంలో గిరిజన విద్యార్థులు, కళాకారులకు నిర్వహించిన బుధవారం రాష్ట్రస్థాయి చిత్రలేఖనం పోటీలు ఉత్సాహంగా జరిగాయి. ముందుగా ఈ కార్యక్రమాన్ని టీసీఆర్‌టీఎం ఈడీ డా.రాణి మందా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, గిరిజన విద్యార్థుల్లోని ప్రతిభను వెలికితీసేందుకు ఇలాంటి పోటీలు దోహ దపడతాయని అన్నారు. ఈ పోటీల్లో 8 ఐటీడీఏల పరిధిలోని 17 జిల్లాల నుంచి 250 మంది పాల్గొన్నారని వెల్లడించారు. ఏయూ ఫైన్ ఆర్ట్స్ విభాగం ఆచార్యులు న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారని తెలిపారు. నెల్లూరు ఐటీడీఏకు చెందిన సీహెచ్ మణి విజేతగా నిలవగా, పాడేరు ఐటీడీఏకు చెందిన బి.నందిని, ఆర్.రాజేష్‌లు ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. అనంతరం విజేతలకు ఈడీ బహుమతులు ప్రదానం చేశారు. గాయత్రి కళాశాల ప్రొఫెసర్ పి.వి.శర్మ, టీసీఆర్‌టీఎం సభ్యులు పాల్గొన్నారు.

ఏప్రిల్ 25 నుంచి 'జన్మభూమి' రూట్ మార్పు

చర్లపల్లి, అమ్ముగుర, సనత్‌నగర్ మీదుగా ప్రయాణం

తాటిచెట్లపాలెం: విశాఖపట్నం–లింగంపల్లి–విశాఖపట్నం మధ్య నడుస్తున్న జన్మభూమి సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ త్వరలో రూటు మారనుంది. సికింద్రాబాద్ స్టేషన్‌కు ప్రయాణికుల తాకిడి తగ్గిస్తూ.. ఇటీవల ప్రారంభించిన చర్లపల్లి టెర్మినల్‌కు ప్రయాణికుల తాకిడిని పెంచేందుకు ఈ మార్పును చేసినట్లు తెలుస్తోంది. ఏప్రిల్ 25 నుంచి సికింద్రాబాద్, బేగంపేట మీదుగా కాకుండా చర్లపల్లి, అమ్ముగుర, సనత్‌నగర్ మీదుగా జన్మభూమి ఎక్స్‌ప్రెస్ రాకపోకలు సాగించనుంది. విశాఖపట్నం–లింగంపల్లి(12805) జన్మభూమి ఎక్స్‌ప్రెస్ ఏప్రిల్ 25 నుంచి, లింగంపల్లి–విశాఖపట్నం(12806) జన్మభూమి ఎక్స్‌ప్రెస్ ఏప్రిల్ 26 నుంచి వయా చర్లపల్లి–అమ్ముగుడ–సనత్ నగర్ మీదుగా రాకపోకలు సాగిస్తాయి. విశాఖపట్నం–లింగంపల్లి(12805) ఎక్స్‌ప్రెస్ సాయంత్రం 6.05 గంటలకు చర్లపల్లి చేరుకుని, అక్కడ నుంచి 6.10 గంటలకు బయల్దేరి రాత్రి 7.40 గంటలకు లింగంపల్లి చేరుకుంటుంది. లింగంపల్లి–విశాఖపట్నం (12806) జన్మభూమి ఎక్స్‌ప్రెస్ ఉదయం 7.15 గంటలకు చర్లపల్లి చేరుకుని.. అక్కడ నుంచి 7.20 గంటలకు బయలుదేరి రాత్రి 7.45 గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది.

చిత్తశుద్ధితో 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర'

కలెక్టర్ హరేంధిర ప్రసాద్ ఆదేశం

మహారాణిపేట: నెలలో మూడో శనివారం చేపడుతున్న స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలను చిత్తశుద్ధితో నిర్వహించాలని కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాల నిర్వహణపై బుధవారం తన చాంబర్ నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అధికారులకు దిశా నిర్దేశం చేశారు. అజెండా అంశాలకు అనుగుణంగా క్షేత్ర స్థాయిలో సేవా కార్యక్రమాలు చేపట్టాలని, మెగా క్లీనింగ్ డ్రైవ్ పెట్టి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని హితవు పలికారు. ప్లాస్టిక్ వినియోగానికి దూరంగా ఉందామని పిలుపునిచ్చారు. స్వచ్ఛాంధ్ర సాధనలో ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, అంకితభావం ప్రదర్శించాలని సూచించారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, విద్యా సంస్థలు, ఆలయాలు, చర్చిలు, మసీదులు, పార్కులు, బస్, రైల్వే స్టేషన్లు, వసతి గృహాలు, ఆస్పత్రులు, తదితర ప్రాంతాల్లో ఈ నెల మూడో శనివారం స్వచ్ఛందంగా పరిశుభ్రత చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. ఆయా ప్రాంతాలు, కార్యాలయాల పరిధిలో చేపట్టిన పనులకు సంబంధించి ఫొటోలు, ఇతర నివేదికలు సీపీవో ద్వారా నివేదించాలన్నారు. టెర్రస్ గార్డెనింగ్, తడిపొడి చెత్త నిర్వహణ, పబ్లిక్ టాయిలెట్ల వినియోగం, పరిసరాల పరిశుభ్రత తదితర అంశాలపై సచివాలయ సిబ్బంది ద్వారా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమం అమలులో ముందస్తు కార్యాచరణ రూపొందించుకోవాలని సూచించారు.

విద్యుత్ స్తంభం పడిన ఘటనలో ఒకరు మృతి

అక్కిరెడ్డిపాలెం: విశాఖ డెయిరీ వద్ద మంగళవారం విద్యుత్ స్తంభం పడి తీవ్ర గాయాల పాలైన బొత్స కామేశ్వరరావు(37) కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ మరణించారు. భెల్ వైపు నుంచి విశాఖ డెయిరీ వైపు వెళ్లేందుకు జంక్షన్‌లో బైక్‌పై వేచి ఉన్న ఆయనపై విద్యుత్ స్తంభం పడింది. ఈ ఘటనలో ఆయనకు తీవ్ర గాయాలు కావడంతో కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందారు. ఆయనది అనకాపల్లి జిల్లా కె.కోటపాడు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించినట్లు పోలీసులు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

ప్రశ్నిస్తేనే సైబర్ నేరాలకు అడ్డుకట్ట

- పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి
- ముగిసిన సైబర్ సెక్యూరిటీ బూట్ క్యాంప్



బహుమతులు అందజేస్తున్న కమిషనర్ బాగ్చి

విశాఖ విద్య: యువతరం సైబర్ నేరాలను నియంత్రించే నిపుణులుగా తయారు కావాలని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి పిలుపునిచ్చారు. ఏయూ ఇంజినీరింగ్ కళాశాలలోని వైవీఎస్ మూర్తి ఆడిటోరియంలో నిర్వహిస్తున్న ఐదు రోజుల బూట్ క్యాంప్ బుధవారంతో ముగిసింది. సైబర్ దాడులు, సైబర్ నేరాలు అనేక దేశాలను ఆర్థికంగా ఇబ్బందులకు గురి చేస్తున్న తీరును ఈ సందర్భంగా సీపీ వివరించారు. వ్యవస్థలోని లోపాలను తమకు అనుకూలంగా మార్చుకుని సైబర్ మోసగాళ్లు నేరాలకు పాల్పడుతున్న విధానాన్ని తెలిపారు. ముఖ్యంగా మహిళలు, విద్యార్థినులను సైతం లక్ష్యంగా చేసుకుంటున్నారని, వీరు మరింత అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రశ్నించడం మొదలు పెడితేనే సైబర్ నేరాలకు అడ్డుకట్ట వేయవచ్చని, యువత సైబర్ సెక్యూరిటీ రంగంలో నిష్ణాతులుగా మారడానికి అవసరమైన కోర్సులు చేయాలని సూచించారు. ఏయూ ఉపకులపతి ఆచార్య జి.పి.రాజశేఖర్ మాట్లాడుతూ తరగతి గదిలో నేర్చుకున్నదానికి భిన్నంగా బూట్ క్యాంపులో నైపుణ్యాలు వృద్ధి చెందుతాయని చెప్పారు. పోలీస్ శాఖ నేడు అనేక సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కొంటోందన్నారు. ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య జి. శశిభూషణ రావు మాట్లాడుతూ సైబర్ నిపుణులను తయారు చేయడం, విద్యార్థులకు సైబర్ సెక్యూరిటీపై శిక్షణ అందించడం, ప్రజల్లో అవగాహన కలిగించడం ఈ కార్యక్రమ లక్ష్యాలన్నారు. ఆచార్య వి. వల్లి కుమారి, కంప్యూటర్ సైన్స్ విభాగ ఆచార్యులు ఆచార్య ఎం. శశి, ఆచార్య జి. లావణ్య దేవి తదితరులు మాట్లాడిన అనంతరం విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. కంప్యూటర్ సైన్స్ విభాగం ఆచార్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రేపు 'స్టీల్‌ప్లాంట్' రక్షణ కోసం నిరసనలు


సీతమ్మధార: స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపాలని, ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించాలని, సెయిల్‌లో విలీనం చేయాలని, కాంట్రాక్ట్ కార్మికుల తొలగింపులు ఆపాలని తదితర డిమాండ్లతో రాష్ట్ర వ్యాప్తంగా ఈనెల 14వ తేదీన నిరసన ప్రదర్శనలు చేపట్టాలని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట రాష్ట్ర కమిటీ పిలుపునిచ్చింది. విశాఖలో జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ఆ రోజు ఉదయం 10 గంటలకు నిరసన ప్రదర్శన జరుగుతుందని సీఐటీయూ విశాఖ జిల్లా అధ్యక్షుడు కె.ఎం.శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి ఆర్.కె.ఎస్.వి.కుమార్ తెలిపారు. అలాగే పాత గాజువాక జంక్షన్‌లో నిరసన చేపట్టాలని విశాఖ స్టీల్ పరిరక్షణ పోరాట కమిటీ నిర్ణయించిందని పేర్కొన్నారు. వీటితో పాటు అన్ని ప్రభుత్వ రంగ పరిశ్రమల గేట్ల వద్ద, కార్మికుల పని ప్రదేశాల్లోను నిరసనలు తెలపాలని అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జేఏసీ పిలుపునిచ్చింది.

పరీక్షలు బాగా రాయలేదని విద్యార్థి ఆత్మహత్య

బీచ్‌రోడ్డు: ఇంటర్ పరీక్షలు సరిగ్గా రాయలేదని మనస్తాపంతో ఓ విద్యార్థి ఆత్మహత్య చేసుకుంది. మూడో పట్టణ పోలీసులు తెలిపిన వివరాలివి. సిరిపురంలోని ఓ అపార్ట్‌మెంట్‌లో తల్లితో పాటు నివాసం ఉంటున్న బాలిక ఇంటర్ పరీక్షలు సరిగ్గా రాయకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురైంది. దీంతో బుధవారం తెల్లవారుజామున 3 గంటలకు గదిలోని సీలింగ్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఉదయం తల్లి చూసేసరికి విగతజీవిగా కనిపించింది. ఆమె మూడో పట్టణ పోలీసులకు సమాచారం ఇవ్వగా.. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

15న జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు

మహారాణిపేట: ఉమ్మడి విశాఖ జిల్లా ప్రజా పరిషత్ స్థాయీ సంఘాల సమావేశాలు ఈ నెల 15న చైర్‌పర్సన్ జె.సుభద్ర అధ్యక్షతన నిర్వహించనున్నట్లు సీఈవో పి.నారాయణమూర్తి తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన జారీచేశారు. జెడ్పీ సమావేశ మందిరంలో ఉదయం 10 గంటలకు స్థాయీ సంఘం సమావేశాలు ప్రారంభం అవుతాయన్నారు. ఉదయం 10 గంటలకు 2వ, 5వ స్థాయీ సంఘం, మధ్యాహ్నం 11 గంటలకు 3, 4వ స్థాయీ సంఘాలు, మధ్యాహ్నం 12 గంటలకు 1, 6, 7వ స్థాయీ సంఘ సమావేశాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అధికారులందరూ సమగ్ర ప్రగతి నివేదికలతో ఈ సమావేశాలకు హాజరుకావాలని ఆదేశించారు.



సేవ్ కిడ్నీ

వరల్డ్ కిడ్నీ డే పురస్కరించుకుని సాగరతీరంలో భారీ సైకత శిల్పం సిద్ధమవుతోంది. చెన్నైకి చెందిన గజేంద్ర అనే కళాకారుడు దాదాపు 20 గంటలకుపైగా శ్రమించి దీనిని రూపొందిస్తున్నారు. ఇందుకోసం ఆర్.కె.బీచ్‌లో ఇసుకను కుప్పగా వేశారు. ఇసుకను నీటితో తడిపి కిడ్నీ రూపంలో తీర్చిదిద్దుతున్నారు. కిడ్నీలను పరిరక్షించుకోవాలనే సందేశంతో ఏసియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ నెఫ్రాలజీ అండ్ యూరాలజీ దీనిని ఏర్పాటు చేస్తోంది. గురువారం ఉదయం 7 గంటలకు ఈ సైకత శిల్పాన్ని ప్రారంభిస్తారు. కిడ్నీలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు పలు కార్యక్రమాలను నిర్వహిస్తారు. - ఏయూక్యాంపస్

కిరండూల్ రైళ్ల గమ్యం కుదింపు

తాటిచెట్లపాలెం: కిరండూల్–బచేలి స్టేషన్ యార్డ్ సంబంధిత భద్రతాపరమైన ఆధునికీకరణ పనుల నిమిత్తం ఈ మార్గంలో నడిచే పలు రైళ్లు ఆయా తేదీల్లో గమ్యం కుదిస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం సందీప్ తెలిపారు. విశాఖపట్నం–కిరండూల్(18515) నైట్ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 16వ తేదీ నుంచి ఏప్రిల్ 2వ తేదీ వరకు దంతేవాడ వరకు మాత్రమే నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో కిరండూల్– విశాఖపట్నం(18516) నైట్ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 17వ తేదీ నుంచి ఏప్రిల్ 3వ తేదీ వరకు దంతేవాడ నుంచి బయల్దేరి విశాఖపట్నం చేరుకుంటుంది. విశాఖపట్నం–కిరండూల్(58501) పాసింజర్ ఈ నెల 16వ తేదీ నుంచి ఏప్రిల్ 2వ తేదీ వరకు దంతేవాడ వరకు మాత్రమే నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో కిరండూల్– విశాఖపట్నం (58502) పాసింజర్ ఈ నెల 17వ తేదీ నుంచి ఏప్రిల్ 3వ తేదీ వరకు దంతేవాడ నుంచి బయల్దేరి విశాఖపట్నం చేరుకుంటుంది.


పలు రైళ్లకు ఉధ్నాలో హాల్ట్

తాటిచెట్లపాలెం: వెస్టర్న్ రైల్వే పరిధి సూరత్ రైల్వేస్టేషన్ రెండో ఫేజ్ అభివృద్ధి పనుల్లో భాగంగా పలు రైళ్లు ఆయా తేదీల్లో దారి మళ్లిస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం సందీప్ తెలిపారు. పూరీ–అహ్మదాబాద్(12843) ఎక్స్‌ప్రెస్ ఈ నెల 12వ తేదీ నుంచి 28వ తేదీ వరకు (రైలు నడిచే రోజుల్లో), పూరీ–ఓఖా(20819) ఎక్స్‌ప్రెస్ ఈ నెల 16వ తేదీ నుంచి 30వ తేదీ వరకు (రైలు నడిచే రోజుల్లో), విశాఖపట్నం–గాంధీధాం(208030 ఎక్స్‌ప్రెస్ ఈ నెల 13వ తేదీ నుంచి 27వ తేదీ వరకు (రైలు నడిచే రోజుల్లో), పూరీ–గాంధీధాం(22974) ఎక్స్‌ప్రెస్ ఈ నెల 15వ తేదీ నుంచి 27వ తేదీ వరకు (రైలు నడిచే రోజుల్లో) సూరత్ స్టేషన్‌కు బదులుగా ఉధ్నా స్టేషన్‌లో ఆగుతుంది. ఈ రైళ్లు ఆయా తేదీల్లో సూరత్ స్టేషన్‌కు చేరుకోవు.

విదేశాల్లో ఉద్యోగాల పేరిట మోసగించిన వ్యక్తి అరెస్టు

విశాఖ సిటీ : విదేశాల్లో ఉద్యోగాలు పేరిట మోసానికి పాల్పడుతున్న వ్యక్తిని నగర పోలీసులు అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళితే.. అనకాపల్లి జిల్లాకు చెందిన చొప్ప మహేష్ గతంలో కాంబోడియా దేశానికి వెళ్లి అక్కడ చైనా సంబంధిత కంపెనీలో పనిచేస్తూ.. సోషల్ మీడియా మాధ్యమాల ద్వారా భారతీయులను మోసం చేసి డబ్బులు దోచుకునేవాడు. కొన్నాళ్ల క్రితం ఇలా మోసం చేసిన పలువురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మహేష్ అప్పట్లో తప్పించుకొని ఇండియాకు వచ్చేశాడు. అతడిపై లుక్ అవుట్ నోటీస్ ఉంది. మళ్లీ సింగపూర్ మీదుగా బ్యాంకాక్ అక్కడ నుంచి కాంబోడియా వెళ్లేందుకు ప్లాన్ చేసుకున్నాడు. ఈనెల 10వ తేదీన విజిటింగ్ వీసాపై బ్యాంకాక్ వెళుతున్న మహేష్‌ను విశాఖ ఎయిర్‌పోర్ట్ ఇమ్మిగ్రేషన్ సిబ్బంది అదుపులోకి తీసుకున్నారు. అనంతరం అతడిని రిమాండ్‌కు తరలించారు. ఈ విధంగా మరెవరైనా మోసపోయినట్లయితే 7995095799 ఫోన్ నంబరుకు సంప్రదించాలని పోలీస్ కమిషనర్ కార్యాలయ అధికారులు తెలిపారు.

లిఫ్ట్‌లో ప్రమాదం.. ఇద్దరికి గాయాలు



ప్రమాదంలో గాయపడిన మహిళ

మధురవాడ: ఓ ఫంక్షన్ హాలు లిఫ్ట్‌లో జరిగిన ప్రమాదంలో ఇద్దరు మహిళలకు తీవ్ర గాయాలయ్యాయి. మరో ఆరుగురు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. వివరాలివి.. పీఎంపాలెం మాస్టర్ ప్లాన్ రోడ్డులోని డీవీఆర్ ఫంక్షన్ హాలులో మంగళవారం మధ్యాహ్నం 2.30 గంటల సమయంలో 3వ అంతస్తు నుంచి కిందకు దిగేందుకు 8 మంది ఎక్కారు. ఈ క్రమంలో లిఫ్ట్ అదుపు తప్పింది. రెండో అంతస్తులో ఆపే ప్రయత్నం చేసినా ఆగకుండా నేరుగా కింది ఫ్లోర్‌కు పెద్ద శబ్దంతో వచ్చి పడిపోయింది. ఈ ప్రమాదంలో మధ్రిపాలెం సాయినగర్‌కి చెందిన వైశ్యరాజు సౌందర్య, ఆమె చెల్లి చంద్ర కుమారి మోకాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. వీరిద్దరిని ఎస్ఆర్ ఆస్పత్రి తరలించి చికిత్స అందించారు. మిగిలిన ఆరుగురు తీవ్ర గాయాలతో బయటపడ్డారు.

ఎంవీవీ సిటీలో..

పీఎంపాలెం క్రికెట్ స్టేడియంనకు ఎదురుగా ఉన్న ఎంవీవీ సిటీలో 10వ అంతస్తు నుంచి కిందకు దిగేందుకు పి.రోజామణి లిఫ్ట్ ఎక్కింది. ఆ లిఫ్ట్ 6వ ఫ్లోర్‌కు వచ్చి పెద్ద శబ్దంతో కుదుపుతో ఆగిపోయింది. ఈ ఘటనలో ఆమె కాలుకు గాయాలయ్యాయి. గత నెల 28న జరిగిన ఈ ఘటనకు సంబంధించి బుధవారం ఆమె పీఎంపాలెం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. సీఐ బాలకృష్ణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కనులపండువగా అనంతుని తెప్పోత్సవం



పుష్కరిణిలో హంస వాహనంపై విహరిస్తున్న అనంతుడు



కోలాటం ఆడుతున్న బాలికలు

పద్మనాభం: అనంతుని కల్యాణోత్సవాల్లో భాగంగా నాల్గో రోజైన బుధవారం అనంతుని తెప్పోత్సవం కనుల పండువగా జరిగింది. కుంతీ మాధవ స్వామి కొలువై ఉన్న శ్రీదేవి భూదేవి సమేత అనంత పద్మనాభస్వామి ఉత్సవ విగ్రహాలను హంస వాహనంపై ఊరేగింపుగా పద్మనాభం జంక్షన్‌కు సమీపంలో ఉన్న అనంతుని పుష్కరిణి వద్దకు వేద పండితులు వేద మంత్రోచ్ఛరణలు, నాద మునీశ్వరు స్వరాల నడుమ తొడ్కొని వచ్చారు. ఇక్కడ కోనేరు గట్టుపై విశ్వేక్షణ పూజ, పుణ్యాహ వచనం నిర్వహించారు. తదుపరి ఉభయ దేవేరులతో అనంత పద్మనాభ స్వామి హంస వాహనంపై ఆశీనులు అయ్యారు. నెల్లిమర్ల శ్రీదుర్గ మహా పీఠం పీఠాధిపతి శ్రవణ చైతన్యానంద చిన్న స్వామి ప్రవచనాలు అనంతరం తెప్పోత్సవం మొదలైంది. స్వామి మూడు సార్లు పుష్కరిణిలో హంస వాహనంపై విహరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ భీమునిపట్నం నియోజకవర్గ సమన్వయ కర్త మజ్జి శ్రీనివాసరావు(చిన్నశ్రీను), ఎంపీపీ కంటుబోతు రాంబాబు, ఈవో నానాజీ బాబు, వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు కోరాడ లక్ష్మణరావు, ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు తనయుడు రవితేజ, తాలాడ పద్మనాభం, కంటుబోతు ఎర్నాయుడు, కాళ్ల నగేష్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పులివేషాలు, కోలాటం వంటి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. భారీ బాణసంచా కాల్చారు.